మద్రాసు క్రైస్తవ కళాశాల (స్వ. ప్ర)
MADRAS CHRISTIAN COLLEGE (AUTONOMOUS)
Vol. : 27 Issue : 7 (2) Spl. Edition May - 2024 ISSN No. : 2457-0796

అంతర్జాతీయ అంతర్జాల వెబినార్

# తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు - సమీక్ష

## "Sahitya Academy Award Winning Writings in Telugu - A Review"

22, 23 డిసెంబర్, 2023

UGC APPROVED JOURNAL
మూసీ ప్రత్యేక సంచిక
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక

నిర్వహణ

తెలుగు శాఖ

మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై

# అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

## తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు – సమీక్ష

22, 23 డిసెంబర్, 2023

**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక**

ప్రథమ ముద్రణ : మే, 2024

ప్రతులు : 500

కాపీలకు : మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు.

ఎడిటోరియల్ చిరునామా
మేనేజర్, **మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,
బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | అపూర్వ ప్రయత్నం | – ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ | vii |
| | ముందుమాట | – డా. శ్రీపురం యజ్ఞశేఖర్ | viii |
| 1. | ఆంధ్రుల సాంఘిక చరిత్రము – ఒక పరిశీలన | – డా. పప్పుల వెంకటరమణ | 09 |
| 2. | ఆంధ్రుల సాంఘిక చరిత్ర – సమీక్ష | – గొంగులూరి కృష్ణవేణి | 14 |
| 3. | నాట్యశాస్త్రము (గుప్త భావ ప్రకాశికా సహితము) అనువాదము – పరిశీలన | – ప్రొ. వి.యస్. మంగాదేవి | 20 |
| 4. | విశ్వనాథ మధ్యాక్కఱలు – యోగ తత్త్వానుశీలనం | – డా. ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి) | 23 |
| 5. | గుఱ్రం జాషువా క్రీస్తుచరిత్ర – ఒక పరిశీలన | – మరపట్ల రాజు | 27 |
| 6. | క్రీస్తుచరిత్ర – జాషువా దృక్పథం | – వి. పద్మ | 31 |
| 7. | అమృతం కురిసిన రాత్రి – తిలక్ కవిత్వం | – డా. సారిక విజయలక్ష్మి | 35 |
| 8. | నార్లవారి 'సీతజోస్యం' హేతువాద దృక్పథం | – డా. ఎం. వెంకట గౌరి | 39 |
| 9. | స్వర్ణకమలాలు – కుటుంబ జీవనం | – డా. ఎం. దేవేంద్ర | 44 |
| 10. | గాలివాన కథ – మనస్తత్వ విశ్లేషణ | – ఈ. కళ్యాణి | 47 |
| 11. | అనువాద సమస్యలు – ఒక పరిచయం | – సి. ఇ. గాయత్రీదేవి | 51 |
| 12. | మోహనా! ఓ మోహనా! ... | – కంచర్ల మహేష్ | 55 |
| 13. | మధురాంతకం రాజారాం కథలలో మానవీయ దృక్పథం | – గొల్లపల్లి వనజ | 60 |
| 14. | రాయలసీమ అభ్యుదయ కథాదీప్తి – కేతు విశ్వనాథరెడ్డి | – ఓ. హరీష్ | 64 |
| 15. | అజంతా 'స్వప్నలిపి' కావ్యం – కవితా దర్శిని | – తుళ్ళూరు రవి | 68 |
| 16. | కథా రచయితలకు మార్గదర్శిగా 'కథాశిల్పం' | – కొండ ప్రవళిక | 73 |
| 17. | శ్రీకృష్ణ చంద్రోదయము పద్యకావ్యం – విశ్లేషణ | – బి.వి.యస్. గౌతమ | 79 |
| 18. | తనమార్గం కథలు – స్త్రీవాద భావనలు | – డా. నేమాని శారద | 84 |
| 19. | విముక్త కథలోని స్త్రీ పాత్రలు – ఓల్గా దృష్టి | – గంధం రోజమ్మ | 88 |
| 20. | విముక్త కథలు – స్త్రీ సాధికారత | – డా. కర్రి శ్యామలాదేవి | 93 |
| 21. | గాలిరంగు కవితాసంపుటి సామాజిక విశ్లేషణ | – నోసిన వెంకటేశ్వర్లు | 96 |
| 22. | గాలిరంగు – మానవత్వం | – కె. విశ్వనాథ్ | 100 |
| 23. | బండి నారాయణస్వామి శప్తభూమి నవల – వస్తు వైవిధ్యం | – డా. వడక వెంకటేశులు | 104 |
| 24. | శప్తభూమి నవల – నామౌచిత్యం | – బుకే ధనక నాయక్ | 108 |

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 7 (2) హైదరాబాద్ మే - 2024

# విముక్త కథలు - స్త్రీ సాధికారత

డా. కర్రి శ్యామలాదేవి, తెలుగు అధ్యాపకురాలు,
అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల (స్వ), కాకినాడ

తెలుగుసాహిత్యంలో 2015వ సంవత్సరానికి గానూ కేంద్ర సాహిత్య పురస్కారాన్ని గెలుచుకున్న కథల సంపుటి విముక్త. ఓల్గా కలంపేరు కలిగిన పోపూరి లలితకుమారి స్త్రీవాద దృక్పథంతో రచనలు చేస్తూ, స్త్రీవాద రచయిత్రిగా ఖ్యాతి పొందారు. వీరి కలం నుండి జాలువారిన విముక్తి కథలు కన్నడం, తమిళం, నేపాలీ, ఒరియా, హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువాదమయ్యాయి. తమిళ భాషలో అనువదించిన గౌరీ కృపానందన్‌కీ 2015 లోనే అనువాద సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం విశేషం.

ఆధునిక సాహిత్య యుగంలో ప్రాచీన సాహిత్యాన్ని ముఖ్యంగా పురాణేతిహాసాలను పాశ్చాత్య సిద్ధాంతాల దృక్పథంతో విశ్లేషిస్తూ పునర్లిఖించడం మొదలైంది. త్రిపురనేని, చలం, నార్ల వేంకటేశ్వరరావు పలువురు రామాయణ, మహా భారతాలను హేతువాద దృష్టితో వ్యాఖ్యానించారు. ఓల్గా రామాయణ కావ్యంలోని ప్రసిద్ధ స్త్రీ పాత్రలను స్త్రీవాద దృక్పథంలో రచించిన కథలు విముక్త. స్త్రీ అస్తిత్వ చైతన్యమే లక్ష్యంగా, స్త్రీ సాధికారతే ధ్యేయంగా రచింపబడిన ఈ కథలు సమాజంలో తరతరాలుగా జీర్ణించుకుపోయిన, జీర్ణించుకుపోయేలా చేసిన వ్యవస్థా ధర్మాల విలువలను ప్రశ్నిస్తూ, ఆధిపత్యపు ధోరణిలో దాగివున్న స్వార్థపూరిత ఆలోచనలను నిలదీస్తూ ఆవిష్కరింపబడినవి. ముఖ్యంగా పురుష స్వామ్య వ్యవస్థ స్త్రీల చుట్టూ సృష్టించిన పాతివ్రత్యం, మాతృత్వం వంటి సంకుచిత భావాల శృంఖలాలను గుర్తించి, వాటి నుంచి విముక్తి పొందాలనే చైతన్యాన్ని, తమ ఉనికిని తాము తెలుసుకుని, తమపై తమకు గల అధికారాన్ని పొందాలనే దిశానిర్దేశం చేస్తాయి.

రామాయణంలో ప్రధానపాత్ర సీత. భార్యగా రాముడిని ఎంతో ప్రేమించి, రామునితో ఎంతో ప్రేమించబడి క్షత్రియ ధర్మం పేరిట రామునితో అనుమానింపబడి, అవమానింపబడి పరిత్యజించబడుతుంది. రామ సాన్నిహిత్యం కోసం వనవాసం చేసిన సీత, రాముని కోసం శీల పరీక్షకు తలొగ్గిన సీత, రాముని మాటతో అడవులు చేరిన సీత, భర్త ప్రేమకోసం అనుక్షణం పరితపించిన సీత చివరకు రాముడినే వదులుకునే స్థాయికి తన చిత్తాన్ని, వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడం విముక్త కథల సారాంశం.

రామాయణంలోని సీత ప్రధాన సూత్రధారిగా, సీత దృక్పథంలోంచి వెలువడిన విముక్త కథల సంపుటిలో సమాగమం, మృణ్మయనాదం, సైకత కుంభం, విముక్త, బంధితుడు అనే ఐదు కథలున్నాయి. రామాయణ ఇతివృత్తం కనుక కథాగమనాన్ని ప్రత్యేకంగా వివరించవలసిన అవసరం లేదు. కానీ కథల్లోని సంఘటనలు మాత్రం రచయిత్రి సృజనాత్మక భావనల్లోంచి అంకురించినవి.

రామాయణంలోని ఇతర స్త్రీ పాత్రలైన శూర్పణఖ, అహల్య, రేణుకాదేవి, ఊర్మిళ లోకంచే, తమ కుటుంబం చే, భర్తలచే తాము పొందిన అవమానాలు, అనుభవాలను పంచుకున్నప్పుడు సీతలో మొదలైన అంతస్సంఘర్షణ, చేసుకున్న ఆత్మపరిశీలనే పరిణతి గల మనస్సుతో తనను తాను తీర్చిదిద్దుకునేలా చేసి, తనపై తనకు గల అధికారాన్ని గుర్తించి సాధికారతను సాధించేలా చేసింది.

**<u>సమాగమం :</u> సీత, శూర్పణఖల కలయిక సమాగమం కథ**

"రామ లక్ష్మణుల క్రూరమైన పరిహాసానికి పాపం కురూపియైపోయింది... శూర్పణఖను అవమానిస్తే రావణుడు తననపహరించి రాముడి మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు.



94/193

పురుషుల పగలూ ప్రతీకారాలూ తీర్చుకోవడానికేనా స్త్రీలుంది?... అదంతా రాజకీయం..." కథలో శూర్పణఖను తలుచుకున్నప్పుడు రచయిత్రి సీతలో పలికించిన భావాల ద్వారా పురుషులు, తమ స్వార్థం కోసం ఏవిధంగా స్త్రీలను బలిచేస్తారో అర్థం చేసుకోవడం తెలుస్తుంది. రామరావణులు కేవలం తమ రాజకీయ లబ్ధికోసం, పురుషాహంకార తృప్తికోసం తమను శారీరకంగా, మానసికంగా హింసించి తమ తమ పరాక్రమాలను నిరూపించుకున్నారని గ్రహిస్తుంది.

రామునివల్ల నిరాకరింపబడి, హింసించబడి కురూపిగా మారిన శూర్పణఖకు ఒంటరితనం, ప్రేమరాహిత్యమే మిగులుతుందని భావించిన సీతకు జీవితాన్ని ఎదిరించి నిలబడిందని, అందానికి అర్థం తెలుసుకొని ఆనందంగా జీవిస్తుందని తను చేసిన యుద్ధము, తనకు తానే గురువైన వైనాన్ని శూర్పణఖ మాటలు ద్వారా విన్న సీత మదిలో సంఘర్షణ మొదలైంది.

శూర్పణఖ సీతను శ్రీరాముని భార్యగా గుర్తించనపుడు 'నేను సీతను, జనకుని కుమార్తెను, జానకిని, భూపుత్రిని' అని ఆత్మాభిమానంతో పలికినా, రామునిచే పరిత్యజించబడ్డాననే దు:ఖంతో విలపిస్తుంది. పురుష సాహచర్యంతోనే స్త్రీ జీవితం సంపూర్ణం కాదనే విషయాన్ని శూర్పణఖ జీవితం ద్వారా గమనించిన సీత రాముడిని ప్రేమించడం, రాముని చేత ప్రేమించబడడంలోనే తన సంపూర్ణం లేదని తెలుసుకుంటుంది. 'నా బిడ్డలు నన్నొదిలి నగరానికి వెళ్ళాక భూపుత్రిక నవుతాను' అని ఆత్మవిశ్వాసంతో పలకడం సీతలో మొదలైన చైతన్యానికి నిదర్శనం.

<u>మృణ్మయనాదం</u> : అహల్యకు సంబంధించిన కథ మృణ్మయనాదం

'అందమైన స్త్రీలను భోగవస్తువులనుకుంటారు గదా పురుషులు...' అని అహల్య సీతతో పలికిన మాటలు పురుషులకు స్త్రీలయందు కలిగివుండే వస్తుభావ దృష్టిని తెలుపుతుంది. గౌతముని భార్యయైన అహల్యను చీకటిలో ఆమె భర్త వేషంలో వెళ్ళి లోబరచుకుంటాడు ఇంద్రుడు. వచ్చినవాడు తన భర్తకాదని అహల్య గుర్తించిందా? లేదా? అనే విషయంతో గౌతమునికి పనిలేదు. తాత్కాలికంగానైనా తన వస్తువు పరహస్తగతమై అపవిత్రమై పోయిందనే గౌతముని వస్తుభావ జాలాన్ని నిలదీస్తూ ఎవరి సత్యం వారిదని, సత్యాసత్యాలు నిర్ణయించగల శక్తి ఈ ప్రపంచంలో ఎవరికీ లేదని నిర్ధారిస్తుంది.

పురుషాధికారానికి లోబడి ప్రవర్తించినంతకాలం ఏంచేసినా ప్రాయశ్చిత్తం, పరిష్కారాలుంటాయి. కానీ అధికారాన్ని ప్రశ్నిస్తే, మూలాలను నిలదీస్తే ఎదురయ్యే వ్యతిరేకతను తేటతెల్లం చేస్తుంది అహల్య. అందుకే నాలా మాట్లాడేవాళ్ళని లేదా ప్రశ్నించేవాళ్ళని భరించడం కష్టమని అంటుంది. సీత గౌతముడు ఆమెను పరిత్యజించారన్నపుడు 'పాపం నన్ను పోగొట్టుకున్నాడు' అని ధైర్యంగా, స్థిరంగా అనగలిగింది.

'ఎన్నడూ విచారణకు అంగీకరించకు... అధికారానికి లొంగకు' అని అహల్య సీతతో చెప్పిన మాటలకర్థం ఆ క్షణంలో తెలియకపోయినా, రావణ సంహారానంతరం సీతను శీల నిరూపణ కోసం అగ్ని పరీక్ష చేసుకోమన్నప్పుడు తనపై తనకు గల అధికారం లోకం చెప్పే నీతి సూత్రాలు, ధర్మ శాస్త్రాలకు లోబడి పోవడాన్ని తెలుసుకుంటుంది సీత. రాముని భార్యగా శీలపరీక్షకు తలొగ్గిన వేదనలోంచి తేరుకొనేలోగా లోకనిందచే పరిత్యజించబడుతుంది. భార్యల విషయంలో మగవాళ్ళందరూ ఒకటేనన్న అహల్య మాటల ఆంతర్యాన్ని గ్రహించి దుఃఖిస్తుంది.

రాముని కోసం కాక తనకోసం తాను నిర్ణయాలు తీసుకునే వరకూ తాను పొందుతున్న దుఃఖం వెంటాడుతూ ఉంటుందనే విషయం అహల్య ద్వారా తెలుసుకున్న సీత పాతివ్రత్యం, మాతృత్వమే స్త్రీల జీవితగమ్యం కాదనే సారాన్ని అవగతం చేసుకుంటుంది.

రాముడు పుత్రులను వారసులుగా గ్రహించి అయోధ్యకు రమ్మన్నప్పుడు చిరునవ్వుతో తిరస్కరించగలిగింది. 'నీ పిల్లలను వదిలి నువ్వుండగలవా సీతా' అన్న రాముని ప్రశ్నకు తన దృష్టిలో పిల్లలు 'విశ్వంలోని అనంత ప్రాణశక్తికి ప్రతీకలని, వారు విశ్వానికంతటికీ చెందినవారని' చెప్పి, మీరు కేవలం అయోధ్యకూ, సూర్యవంశానికీ మాత్రమే చెందిన వారిగా భావిస్తే మీ నమ్మకం ప్రకారం మీరు నడుచుకొమ్మని చెప్తుంది. తనను తాను తెలుసుకున్న సీత విశ్వంలో తనకు లేనిదంటూ ఏమీలేదని, తాను భూపుత్రిని అంటూ సగర్వంగా చెప్పడం సీతలోని సాధికార శక్తికి నిదర్శనం.

<u>సైకతకుంభం</u> : రేణుకాదేవికి సంబంధించిన కథ సైకితకుంభం

'భర్తల గురించి, కుమారుల గురించి నాకు తెలిసినట్లు మరెవరికీ తెలియదు' అని రేణుక సీతతో తన జీవితంలో పాతివ్రత్యం, మాతృత్వం మిగిల్చిన దుఃఖాన్ని చెప్పి, ప్రతి స్త్రీ తన పాతివ్రత్యం సైకతకుంభం వంటిదేనని తెలుసుకుంటే నిశ్చింతగా బ్రతకవచ్చని చెప్పడం, పురుషస్వామ్య వ్యవస్థ నిర్మిత పాతివ్రత్య భావనల్లోని డొల్లతనాన్ని వివరిస్తుంది.

మృత్యువు దాకా వెళ్ళిన రేణుకకు భర్త సంతానం, సైకితకుంభ విద్య దర్శనమిచ్చాయని, అల్పకారణాలతో ఛిన్నాభిన్నమయ్యే ఈ మూడు జీవితాన్ని కత్తి అంచున వేలాడదీసినపుడు, భర్త కుమారులు అనే బంధాలు స్త్రీలకు అవసరమా? అనే ప్రశ్నతో, అవసరం లేదనే తీర్మానంతో అందరికీ దూరంగా బతుకుతున్నానని సీతతో చెప్పడం వెనుక స్త్రీలకు భర్త, మాతృత్వం కంటే వేరే ప్రపంచం ఉందనే అంశాన్ని ప్రతిపాదిస్తుంది. భర్త ప్రేమలోనూ, పిల్లపై ప్రేమలోనూ తనకు లేని అధికారాన్ని గుర్తించి, రెంటినీ నిర్మమకారంగా వదులుకోగల మానసిక స్థితిని పెంపొందించుకోగలిగింది.

పురుష ప్రపంచం సృష్టించిన నీతి నియమాల చట్టాల కింద నలిగిన స్త్రీలలో తాను మొదలు కాదు, చివరా కాదనే సత్యాన్ని తెలిసి తానొంటరి కాదనే చైతన్యాన్ని పొందింది సీత. లవకుశలను వారసులుగా స్వీకరించిన రాముడు సభలో అందరిముందూ సత్యం పలకమని చెప్పాడని చెప్పిన వాల్మీకితో 'నాకంత అవసరం ఉందంటారా? ఆ ప్రయాసకు అర్థముందంటారా? అనేంతగా... స్థిర, స్థిత అంతరంగాన్ని నిర్మించుకుంది సీత.

<u>**విముక్త**</u> : 'నీమీద అధికారాన్ని నువ్వే తీసుకో, ఇతరులపై అధికారాన్ని వదులుకో, అప్పుడు నీకు నువ్వు చెందుతావు, నీకు నువ్వు దక్కుతావు. మనకు మనం మిగలటమంటే మాటలు కాదక్కా-? ఊర్మిళ సీతతో చెప్పిన మాటలు పద్నాలుగేళ్ళ ఏకాంతవాసంలో ఊర్మిళ సాధించిన సాధికారతకు చిహ్నం.

లక్ష్మణుడు శ్రీరామునితో వనవాసానికి వెళ్ళాలనే నిర్ణయాన్ని ఊర్మిళ ప్రమేయం లేకుండానే తీసుకున్నప్పుడు, ఆమె తనలో కలిగిన కోపాన్ని అన్వేషణగా మార్చుకొని తనపై తనకు గల అధికారాన్ని తెలుసుకుంటుంది. సర్వ దుఃఖాలకూ అధికారమే మూలమని, ఎవరి అధికారాన్ని వారే పొందాలని, అందుకోవాలనీ, ఎవరి అధికారానికి లొంగక, అధికారంతో ఎవరిని బాధించక తననుంచి తాను విముక్తం పొందడం ద్వారా లభించే ఆనందం, శాంతి అందరికీ అర్థంకాకే అధికార ఛట్రంలోపడి దుఃఖంతో కుళ్ళిపోతున్నారని చెప్పడం సీతలో నివురుగప్పిన నిప్పల్లే దాగివున్న అశాంతి వెనుక గల కారణాన్ని పరిశీలించుకోవలసిన స్థితిని కల్పించింది.

రాముడు అశ్వమేధయాగం చేస్తున్నాడని తెలిసిన క్షణం నుండి తన స్థానంలో ఎవరుంటారనే ప్రశ్నతో రగిలిపోతున్న సీతలో ఊర్మిళ అనవసర ప్రశ్నలతో తనను తాను హింసించుకోవద్దని, రాముని నుండి విముక్తం పొంది నీవనే యథార్థాన్ని తెలుసుకోమంటుంది. రాముడు లవకుశలను స్వీకరించి తన నిర్దోషత్వాన్ని సభలో ప్రకటించుకోమన్నాడని వాల్మీకి చెప్పినపుడు అంతవసరం ఉందంటారా నాకు అంటూ పిల్లల నుండి కూడా విముక్తురాలై తనకు తానే యథార్థమనే సత్యాన్ని తెలుసుకుంది సీత.

ఈ విధంగా విముక్త కథల్లోని ప్రధాన పాత్రలైన సీత, శూర్పణఖ అహల్య, రేణుక, ఊర్మిళ అందరూ పురుష ప్రపంచం సృష్టించిన అధికార, ఆధిపత్య చట్రాలకింద నలిగి అవమానాలు, తిరస్కారాలకు గురై దుఃఖించినవారే. కానీ ఆ దుఃఖంలోంచే తమ అస్తిత్వాలను గుర్తించి, సాధికారతను సాధించారని చెప్పిన రచయిత్రి కల్పనాశక్తి అద్భుతం.

ఓల్గా కథల్లోని ఇతివృత్తం రామాయణంలోనిదే అయినా ఆధునిక యుగంలోనూ స్త్రీల పరిస్థితి అదే స్థితిలో ఉండడాన్ని తెలియపరుస్తూ, మార్పురాని పితృస్వామ్య వ్యవస్థ భావనలను ప్రశ్నించాయి. చైతన్యాల మూలమైన ప్రకృతిలో అంతర్భాగమైన స్త్రీలు జడత్వ భావనలతో స్థిరీకరణం చెందకుండా అంతశ్శక్తిని గుర్తించి చైతన్య పథంలోకి సాగాలని ప్రేరేపించాయి.

**ఆధార గ్రంథాలు**

1. విముక్త కథలు – ఓల్గా
2. నీలి మేఘాలు – అస్మిత ప్రచురణ
3. స్త్రీవాద వివాదాలు – ఎస్.వి. సత్యనారాయణ